ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
శుక్రవారం 16 మే 2025



స్వశక్తి మహిళలకు బీమాతో ధీమా





స్వశక్తి సంఘాల మహిళలకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రమాద బీమా, లోన్ బీమా సౌకర్యం కల్పిస్తోంది. దీనిపై సెర్ప్ సిబ్బంది మహిళా సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

చింతలమానేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): అతివల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వాలు రుణాలను అందిస్తున్నాయి. సంఘాల ఏర్పాటు ద్వారా సభ్యులు రుణాలను పొందుతూ స్వశక్తితో ఎదుగుతున్నారు. సంఘాల్లోని మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మహిళకు బీమా సౌకర్యం కల్పించాలని ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకు వచ్చింది. సంఘాల్లో సభ్యురాలిగా ఉండి స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న మహిళ అనివార్య కారణాల వల్ల మరణిస్తే రెండు లక్షల రుణాన్ని ప్రభుత్వమే చెల్లించేది. తాజాగా ప్రభుత్వం ఈ విధానాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న వారికి కూడా వర్తింపజేసేలా చేసింది.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 398 మండల సమాఖ్యలు, 7,916 గ్రామైఖ్య సంఘాలు, 90,379 మంది మంది సభ్యులు ఉన్నారు. అర్హత కలిగిన ప్రతీ మహిళ స్వయం సహాయ సంఘాల్లో చేరాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించి ప్రోత్స హిస్తోంది. సంఘం సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకొని చిరు వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీకి స్త్రీనిధి, మహిళా శక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలను అందజేస్తున్నారు. కానీప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దీని ద్వారా గ్రామాల్లో ఈ పథకంలో మరింత మంది మహిళలు చేరే అవకాశం ఉంది. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివరాలు నిధి పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి.

మహిళలకు ప్రయోజనం..: సదానందం, ఏపీఎం

సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు బీమా సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. బీమాపై మహిళా సంఘ సభ్యులందరికీ అవగాహన కల్పిస్తు న్నాం. గ్రామాల్లో వీవోఏల ద్వారా ఎప్పటికప్పుడు రు ణాల మంజూరు, బీమా తదితర వంటి వాటి గూర్చి అవగాహన కల్పిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నాం.



- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10లక్షలు
- అంగవైకల్యం పొందితే రూ. 5లక్షలు
- జిల్లాలో 398 మండల సమాఖ్యలు
- 7,916 గ్రామైఖ్య సంఘాలు, 90,379 మంది సభ్యులు

ఒక్కో సంఘానికి..

ఒక్కో సంఘానికి ఐదు నుంచి 20 లక్షల రూపాయల వరకు రుణాలు అందజేస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది. అలా చెల్లించకపోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణ బీమా వర్తింప చేసింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుంది.

సభ్యులు మృతి చెందితే..

పొదుపు సంఘాల మహిళలు మృతి చెందితే వారి కుటుంబాలకు 10లక్షల రూపాయల ఉచిత బీమా వర్తింప జేస్తున్నారు. వంద శాతం వైకల్యం కలిగినా ఐదు లక్షలు రూపాయలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళ రుణం తీసుకుంటే మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం చెందితే సదరం ధ్రువ పత్రాలు, చికిత్స పొందిన ఆస్పత్రి పత్రాలు సమర్పించాలి. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు వయస్సు ఉన్న పొదుపు మహిళలకు ఇది వర్తిస్తుంది.

నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా రవాణా శాఖాధికారి రామచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో ఎంవీఐలు గాదె మోహన్, రాయమల్లులతో కలిసి పాఠశాల, కళాశాలల బస్ యజమానులకు డ్రైవర్లు, సహాయకులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా పరీక్షల సహా యాధికారి ఉదయ్‌బాబు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, వర్కింగ్ ప్రసిడెంట్ సంజీవ్ కుమార్, గోపాల్, సుదర్శన్‌గౌడ్, రాధాకృష్ణచారి, మాలిక్, నరేందర్‌కుమార్ పాల్గొన్నారు.

25న కోనేరు అభిమానుల ఆత్మీయసభ

బెజ్జూరు, మే 15(ఆంధ్రజ్యోతి): చింతల మానేపల్లి మండల కేంద్రంలో ఈ నెల 25న కోనేరు అభిమానుల ఆత్మీయసభ నిర్వహించనున్నట్లు మండల నాయకులు బషరాత్‌ఖాన్, సకారాం తెలిపారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు మరికొంత మంది ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ముగిసిన వేసవి క్యాంపు

కెరమెరి, మే 15 (ఆంధ్రజ్యోతి): గోయగాం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్యాంపు గురువారం ముగిసింది. చివరి రోజు ఎంఈవో ఆడె ప్రకాష్ క్యాంపును సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శిక్షకులు గీతా, శశికళ, స్వా తి తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్న అంశాలను పిల్లలకు బోధించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వేసవి శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలని రాష్ట్ర పరిశీలకుడు కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు తప్పిని సరిగి పాటించాలని సూచించారు. ఎంఈవో సుభాష్ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

ఆసిఫాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై సమ్మర్ క్యాంపులో భాగంగా జిల్లా ప్రైమరీ స్కూల్ టీచర్స్‌కు గురువారం షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని గర్ల్స్ హై స్కూల్, జిల్లా ప్రైమరీ స్కూల్ టీచర్స్‌కు మహిళా రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీ టీం నిర్వహిస్తున్న విధుల గురించి, షీ టీం ద్వారా ఎలా రణ పొందవచ్చనే అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వప్న, రజిని, స్వప్న, కానిస్టేబుల్ దినేష్, జీహెచ్ఎం శ్రీలత పాల్గొన్నారు.

పెంచికలపేటలో నేడు మంత్రుల పర్యటన



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ దండె విఠల్

ఆసిఫాబాద్/పెంచికలపేట, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క శుక్రవారం పెంచికలపేటలో పర్యటించనున్నారు. ఒంటిగంటకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం-2025 అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సభ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ శ్రీనివాసరావు బందో బస్తుపై పోలీసు అధికారులతో చర్చించారు. సభా స్థలి వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో కోట ప్రసాద్

కాగజ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోట ప్రసాద్ తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని బోడపల్లి, అందవెల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలకు వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఈయన వెంట ఏపీవో చంద్రశేఖర్, కార్యదర్శులు ప్రసాద్, ప్రణీత, లక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

రెబ్బెన, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు మల్లాజు రాంబాబు తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్‌లో కూడా చాలా మంది యువత నిరుద్యోగులు దరఖాస్తులు చేస్తున్నట్లు కూడా ఇంత వరకు జాబితాను ప్రకటించటం లేదన్నారు. అనివార్య కారణాల వల్ల ఇంటర్వ్యూలకు హాజరు కాని వారికి రాజీవ్ యువ వికాస్‌లో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు.

నిరుపేదలకే పథకం వర్తింపజేయాలి

జైనూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాస పథకం నిరుపేదలకే వర్తింపజేయాలని తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యర్శి ఉయిక చందన్‌శావ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఈ ప్రాంత వాసులు పేదరికంతో జీవనం కొనసాగిస్తున్నారని, సిబిల్ స్కోరుతో నిమిత్తం లేకుండా రుణాలు మంజురు చేయాలని కోరారు.

వంతెనల నిర్మాణం పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులపై పెండింగ్‌లో ఉన్న వంతెనల నిర్మాణం పూర్తి చేయాలని జాతీయ మాన హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ గురువారంకలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాత్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కరంజీవాడ, బోరిలాల్‌గూడ, జన్కాపూర్, అందుగూడ, గోండ్‌గూడ ప్రజలు వర్షాకాలంలో వాగులు ఉప్పొంగడంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.స్పందించిన కలెక్టర్ పీఆర్ అధికారులతో మాట్లాడారు. పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ నైతం మోహన్, భానుచందర్, మహేష్, శశాంక్‌లు ఉన్నారు.

పెండింగ్ పనులపై దృష్టి సారించాలి

జైనూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): జైనూరు మార్కెట్ కమిటీ పరిధిలో పెండింగులో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం మార్కెట్ కమిటీ సాధారణ పాలకవర్గ సమావేశం చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులతో కలిసి పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్ బానోత్ జైవంత్‌రావ్, పీఎసీఎస్ చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి, జైనూరు సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్ సభ్యులు చంద్రశేఖర్, జాధవ్ లోకెందర్, మండాడి లింగు, రాధాబాయి, అడ నీల బాయి, ఆత్రం భుజంగ్‌రావ్, జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వర్ అహ్మద్, ఏడీఏ వెంకటి, కార్యదర్శి ఈర్ఫాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోయినా ఇళ్లు కట్టుకుంటాం

బెజ్జూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పోయినా ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుని తీరుతామని సుస్మీర్ గ్రామస్థులు అటవీ అధికారులకు తేల్చి చెప్పారు. మండలంలోని సుస్మీర్ గ్రామంలో గురువారం లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను బెజ్జూరు ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్, బీట్ అధికారులు వెంకటేష్, అనిల్ అడ్డుకున్నారు. గ్రామం రిజర్వు ఫారెస్టులో ఉన్నందున ఇళ్లు నిర్మించుకోవద్దని గ్రామస్థులకు అటవీ అధికారులు సూచించారు. దీంతో గ్రామస్థులు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా తాము ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకని జీవిస్తున్నామని చెప్పారు. నిబంధనలు అతిక్రమించి ఇళ్లు నిర్మిస్తే కేసులు నమోదు చేస్తామని అటవీ అధికారులు హెచ్చరించారు.

అత్యాచారయత్నం కేసులో ఒకరికి పదేళ్లు జైలు

కౌటాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన చాప్లె చందుకు అత్యాచారయత్నం కేసులో పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.40 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పారని ఎస్సై విజయ్ తెలిపారు. 2022 సెప్టెంబరు 4వ తేదీన మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై చాప్లె చందు అత్యాచారయత్నం చేశాడని చెప్పారు. కుటుం బ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. అప్పటి ఎస్సై ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని అన్నారు. గురువారం పీపీ జగన్మోహన్ రావు పూర్తి సాక్షాదారులను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై నేరు రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారని చెప్పారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడేలా చేసిన కోర్టు హెడ్ కానిస్టేబుల్ బాబాజీని న్యాయమూర్తి అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, మే 15 (ఆంధ్రజ్యోతి): అనుకున్న లక్ష్యం సాధించే వరకు వెనుకడుగు వేయకుండా విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో విద్యార్థులు నేర్చుకున్న విద్యా సామర్థ్యాలను, కళా నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా సమమర్ క్యాంపులు నిర్వహించామని చెప్పారు. సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న విషయా లను ఇక్కడితో వదిలేయకుండా ఇళ్లలో కూడా కొనసాగించాలని సూచించారు. చిత్రలేఖనం, యోగా, కరాటే, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాలపై జిల్లా స్థాయిలో పోటీలుపెట్టడం జరుగుతుందని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతి కేటాగిరి నుంచి ముగ్గురిని కలెక్టరేట్‌లో సన్మానించడంతో పాటు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం పోటీ సమాజంలో నిలదొక్కుకోవాలంటే ఏదో ఒక విషయంలో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఏ పని చేసినా నమ్మకం, ఆత్మ విశ్వా సంతో ముందడుగు వేయాలని సూచించారు. స్కూల్ వయస్సులో నేర్చుకున్న కళా నైపుణ్యాలు దీర్ఘకాలంగా గుర్తిండిపోతాయని, క్రీడలు, నృత్యాలు, కరాటే, యోగా వంటి వాటిలో ప్రతిభ కలిగి ఉంటే భవిష్యత్‌లో ఉదోయగ సాధనలోనూ అవి ఉపయోగపడుతాయని అన్నారు. అనర్గళంగా మాట్లాడడం కూడా ఒక కళనని, స్పోకెన్ ఇంగ్లీష్‌లో నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎంఈవో శివచరణ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీటీ శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలి

కౌటాల, మే 15 (ఆంధ్రజ్యోతి): జ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే దంపతులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లెండుగురె శ్యాంరావు, ఆదే వసంత్ రావు అన్నారు. కన్నెపల్లి క్రాస్ రోడ్డు వద్ద జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంగారాం, పాండురంగ, రమేశ్, నగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘రాజకీయంగా దెబ్బ తీసే కుట్ర’

చింతలమానేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా తనను దెబ్బతీయడానికి కొందరు కుట్ర చేస్తున్నారని మాజీ ఎంపీపీ నానయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల, రైతుల భూములు కబ్జా చేశారని తనపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. తమ కుటుంబానికి మొత్తం 12 ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. ఎక్కువ భూమి చూపితే వాళ్లకే ఇస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజకీయంగా తనపై కక్ష కట్టి కొందరికి డబ్బులు ఇచ్చి సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం చేస్తున్నార్నారు. ఇక్కడ పని చేస్తున్న అధికారులు సైతం మాజీ ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉంటూ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త మండలం అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ నమూనా ఇళ్లు, ఎంఈవో భవనం, ఆదివాసీలకు పెట్రోల్ బంక్ మంజూరైతే కనీసం వాటికి స్థలం చూపకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, ప్రసాద్, లచ్చన్న పాల్గొన్నారు.

వేసవి క్యాంపులతో విద్యార్థులకు ప్రయోజనం




ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో హనుమంతు

కౌటాల, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి క్యాంపులతో విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందని ఎంఈవో హనుమంతు అన్నారు. మండలంలోని ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా వేసవి క్యాంపును ఎంఈవో హనుమంతు గురువారం సందర్శించారు. చివరి రోజు కావడంతో ఎక్కువ సంఖ్యలో పాల్గొని 15 రోజుల వేసవి శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మొట్ట మొదటి సారిగా సమ్మర్ క్యాంపులు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో మేలు చేకూరిందని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు వినోద్, డ్యాన్స్ మాస్టర్ సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు నానాజీ, నారాయణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సిద్ధం చేయాలి

కెరమెరి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల రికా ర్డులను సిబ్బంది సిద్ధం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024- 25 ఆర్థిక సంవత్సరం గ్రామాల్లో జరిగిన పనులపై ఈ నెల 20 నుంచి సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు చేపడుతుందన్నారు. సోషల్ ఆడిట్ బృందానికి పని ప్రదేశాలను చూపించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రుల ఎంపిక, తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ప్రత్యేకాధికారి వెంకట్, ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు సతీష్, బొజ్జిరావు, తరుణ్ పాల్గొన్నారు.

యువకుడిని బలిగొన్న ట్రాక్టర్



మధూకర్(ఫైల్)

హాజీపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ఓ యువకుడి నిండుప్రాణాలను బలిగొంది. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం గుడిపేట గ్రామానికి చెందిన బయ్య మధూకర్(31) పాలవ్యాపారం చేస్తుంటాడు. గురువారం ఉదయం మంచిర్యాల జిల్లా కేంద్రానికి పాలు పోయడానికి వెళ్లిన క్రమంలో ముల్కల్లశివారు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా రాంగురూటులో వచ్చి మధూకర్‌బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయాడు. కిందపడిన మధూకర్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హాజీపూర్ వద్ద ఢీకొ ట్టి వెళ్లిపోయిన ట్రాక్టర్‌ను ఇసుకరీచ్‌వద్ద గుర్తించి పట్టుకున్నారు. మృతు డికి కూతురు సాన్విత(2), భార్య మౌనిక ఉన్నారు. మధూకర్ తండ్రి బయ్య సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పారిపోయిన దొంగ అరెస్టు

లక్షెట్టిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడు రోజుల క్రితం పోలీసుల కళ్లుకప్పి పారిపోయిన దొంగను లక్షెట్టిపేట పోలీసులు అరెస్టు చేసారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా మావల మండలానికి చెందిన నిందితుడు గజానంద్ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అల వాటు పట్టాడు. నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేసిన దొంగతనం కేసులో అక్కడి పోలీసులు మూడు రోజుల క్రితం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చి లక్షెట్టిపేట సబ్‌జైలుకు తీసుకురాగా పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. ఎస్సై గోపతి సురేష్ సిబ్బందితో గాలించి నిందితుడిని బుధవారం లక్షెట్టిపేట బస్టాండ్ సమీ పంలో పట్టుకుని అరెస్టు చేసి కోర్టులో హాజర్చుతున్నట్లు సీఐ తెలిపారు.

తాటివనంలో అగ్నిప్రమాదం

లక్షెట్టిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని గొండెర్ల సమీపంలో తాటివనంలో ప్రమాదవశాత్తు గురువారం అగ్ని ప్రమాదం సంభవించడంతో తాటి, ఈత చెట్లు కాలిపోయాయి. సమీ పంలోని వ్యక్తి తన పొలంలో సాగు కోసం మంటలను అంటించుకోవడంతో ఈప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. జన్నారం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసారు. ఈప్రమాదంతో సుమారు 200ఈత, తాటి చెట్లు దగ్ధమయినట్లు తహసీల్దార్ తెలిపారు.

తోటిగూడాన్ని సందర్శించిన అధికారులు

తాండూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచిని పంచాయతీ పరిధిలోని తోటిగూడాన్ని గురువారం అధికారులు సందర్శిం చారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ గత నెల 22న ఉట్నూరు ఐటీడీఏ పీవో కుష్బుగుప్తా సందర్శించిన సమయంలో గ్రామస్తులు వారి సమస్యలను విన్నవిం చారని తెలిపారు. తాగునీటి కోసం బోరు చేతిపంపు, కమ్యూనిటీ హాలు, భీమన్న దేవాలయం కావాలని విన్న వించగా ఈ సమస్యలపై సమావేశం నిర్వహించి గ్రామస్తులతో చర్చించామని చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడిలేకుండా చూడాలి

కాసిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీ డీవో సత్యనారాయణ సింగ్ సిబ్బందికి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వన మహోత్సవం కోసం మొక్కలు సిద్ధం చేయాలన్నారు. అర్హులైన ఉపాధికూలీలందరికి పనులు కల్పించి ఎక్కువ వేతనం పొందేవిధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. రాజీవ్ యువవికాశం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కార్యాలయంలో సమర్పించాలని కోరారు. సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

వేమనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో నీటి సరఫరాలో అంత రాయం లేకుండా చూడాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. గురువారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వన మహోత్సవం కోసం నర్సరీల్లోనిమొక్కలను సిద్ధం చేయానలి సూచించారు. అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులను కల్పించాలని, ఎక్కువ వేతనం వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

తీరని వ్యథ



తాత్కాలిక షెడ్‌లో కొనసాగుతున్న గుండాల పంచాయతీ కార్యాలయం



అసంపూర్తిగా ఆమీన్‌గూడ వంతెన

- అభివృద్ధికి నోచుకోని తిర్యాణి
- గ్రామాలకు రహదారులు కరువు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

తిర్యాణి, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత వెనుకబడిన తిర్యాణి మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటుంది. ఏజెన్సీ మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. మండలం అభివృద్ధి కోసం సింగరేణి సంస్థ నుంచి డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్‌మినరల్ ఫండ్)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు మంజూరవుతున్నా క్షేత్రస్థాయిలో వీటిని సక్రమంగా వినియోగించక పోవడంతో మండలం అభివృద్ధి చెందడం లేదు. మం డలంలో 29గ్రామపంచాయతీలు, 134 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. సుమారు 25వేలపైగా జనాభా నివసిస్తున్నారు. ఇందులో 90శాతం ఆదివాసీలు ఉన్నారు.

● జలపాతాలపై చిన్నచూపే..

మండలంలో చింతలమాదర, గుండాల(బహుబలి), ఉల్లిపిట్ట అనే మూడు అందమైన జలపాతాలు ఉన్నా వీటి అభివృద్ధిపై అధికారులు చిన్నచూపే చూస్తున్నారు. వీటిని చూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు వసస్తుంటారు. కానీ పర్యాటకు కోసం జలపాతాల వద్ద సరైన సౌకర్యాలు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించడం ద్వారా ప్రత్యక్షంగా స్థానికులకు, పరోక్షంగా మండల వాసులకు ఉపాధి కలుగనుంది. కాగా మండలంలోని మెజార్టీ గ్రామాల్లో నేటికీ ఎలాంటి మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేక పోవడంతో సమాచార మార్పిడితో పాటు ఆన్‌లైన్ ద్వారా అందించే పెన్షన్ వంటి ప్రభుత్వ పథకాలు పొందేందుకు లబ్ధిదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. సిగ్నల్స్ సమస్యపరిష్కారానికి బీఎస్ఎన్ఎల్ సంస్థ మండలంలో ఇప్పటికే 15సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణం చేపట్టింది. కాని వాటిని ప్రారంభించక పోవడంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసు కోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రకృతి అందాలకు నిలయమైన తిర్యాణి మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. దీని స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. డీఎంఎఫ్‌టీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలి.

- తోడసం భాస్కర్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు

● 50 శాతం గ్రామాలకు..

మండల కేంద్రం నుంచి దాదాపు 50శాతం గ్రామాలకు వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే గుండా, మంగి, కౌటగాం, గీసిగూడ, గోపెర, భీంరెల్ల, బుగ్గరామన్న, గూడెం, తాటిగూడ, గోవెన, నాయకపుగూడ, కుర్సి గూడ గ్రామాల ప్రజలకు కాలినడకనే శరణ్యమవుతోంది. చాలా గ్రామాలకు మధ్యలో ఉండే వాగుల వద్ద వంతెనలు నిర్మించక పోవడంతో వాగులు ఉప్పొంగిన సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. అంతే కాక మండల కేంద్రం నుంచి ఇన్‌క్లైయిన్ వెళ్లే రహదారి గుంతల మయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది. ఏళ్లుగా చిన్న మరమ్మతులు చేస్తున్నారే తప్ప నూతన రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు. గోడెన పంచాయతీ పరధిలోని నాయకపుగూడ గ్రామానికి నేటికీ విద్యుత్ సరఫరా లేక పోవడం మండలం వెనకబడిన తీరుకు అద్దం పడుతోంది. నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు నేటికీ సరైన భవన నిర్మాణం చేపట్టలేదు. నాయకపుగూడ గ్రామం నుంచి దుగ్గపూర్ గ్రామంపై ఉన్న వాగుపై గత మూడేళ్ల క్రితం నిర్మించ తలపెట్టిన వంతెన పనులు ఇప్పటికీ పూర్తి చేయలే దు. మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వార సంతకు ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తుండగా అటు పంచాయతీ ఆదాయం కోల్పోవడంతో పాటు ఇటు విక్రయదారులు, కొనుగోలుదారులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు

కెరమెరి, మే 15(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని మ్యాట్రిక్స్ అయిల్ పాం కంపెనీ ప్రతినిధి ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన కేలి(బి) గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు అయిల్ పామ్ సాగు చేసినట్లయితే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. మొక్క నాటిన నాలుగు సంవత్సరాల నుంచి గెలలు వస్తాయని చెప్పారు. సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వరకు గెలలు కాస్తాయని తెలిపారు. అంతర పంటగా పెసర, కంది, పత్తి పంటలతో పాటు కూరగాయల పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. రైతులను ప్రోత్సాహకగా ఉద్యనవన శాఖ ద్వారా రూ.4200 అయిల్ పామ్ నిర్వహణకు రైతులకు నాలుగు సంవత్సరాలు అందజే యనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేష్, మ్యాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు రమేష్, ప్రేమ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్‌ను వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమీకృత మార్కెట్‌లోని షాపుల కోసం లబ్దిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి మాట్లాడారు. సమీకృత మార్కెట్‌లో 34షాపు లకు గాను వ్యాపారస్తుల సమావేశంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి 31మంది లబ్దిదారులకు షాపులను కేటా యించారు. ప్రజల సౌకర్యార్థం సమీకృత కూరగాయల మార్కెట్‌లో కూరగాయలతో పాటు మాంసపు ఉత్పత్తులను మార్కెట్‌లో ఒకే చోట విక్రయించే విధంగా నూతన మార్కెట్లు నిర్మించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఆసిఫాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కొండపల్లి కార్యదర్శి ఎం నమృత (అప్పటి ఇందిరానగర్)ను విధుల నుంచి సస్పెండ్ చేశామని డీపీవో భిక్షపతిగౌడ్ తెలిపారు. ఇందిరానగర్ గ్రామ పంచాయతీల్లో వృద్ధాప్య పెన్షన్ రూ.24,192, దివ్యాంగ పెన్షన్ రూ.48,192 సంబందిత పెన్షన్ దారులు చనిపోయిన తరువాత వివరాలను తొలగించకుండా పంచాయతీ కార్యదర్శి వేలి ముద్రతో విత్‌డ్రా చేశారని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

జన్నారం ఫారెస్టు బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

జన్నారం, మే 15 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగం మేరకు కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు కవ్వాల టైగర్ రిజర్వ్ సీఎఫ్, మంచిర్యాల ఎస్డీపీటీ శాంతారాం తెలిపారు. గురువారం స్థానిక అటవీ శాఖ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్నారం డిప్యూటి రేంజ్ ఆఫీసర్ తిరుపతికి మెమో జారీ చేసినట్లు తెలిపారు. జన్నారం అటవీ బీట్‌లోని కొత్తూరుపల్లి గ్రామ సమీపంలో ఉన్న రిజర్వ్ ఫారెస్టు అడవుల్లో కొన్నేళ్ల నుంచి గిరిజనులు అక్రమంగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, రెండు నెలల క్రితం ఇదే ప్రాంతంలో ఉన్న 22 మంది గిరిజనులు గుడిసెలను మూకుమ్మడిగా అటవీ అధికారులు దాడి చేసి తొలగించారన్నారు. అయినా మళ్లీ అదే ప్రదేశంలో గిరిజనులు గుడిసెలు వేసుకున్నారని , తాను బుధవారం సాయంత్రం అక్కడకు వెళ్లి చూసే వరకు సంబంధిత అటవీ అధికారులు పట్టించుకోలేదని, అటవీ భూ ములను సంరక్షించడంలో నిర్లక్ష్యం వహించారనే అభియోగం మేరకు బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశామని తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

మందమర్రిరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఏడీఏ బానోత్ ప్రసాద్ అన్నారు. గురువారం ఫెర్టిలైజర్ దుకాణాల యాజమానులతో ఏవో కిరణ్మయితో కలిసి సమావేశం నిర్వహించారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న కాలనీవాసులు

వేమనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లెడలోని ఎస్టీ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం కాలనీ వాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో గత రెండు సంవత్సరాల నుంచి చేతి పంపులు చెడిపోయినప్పటికీ పట్టించుకునే నాదుడే కరువయ్యాడని ఆరోపించారు. ఇక్కడి గిరిజనులు నీటి కోసం కిలోమీటర్ల దూరాన ఉన్న వ్యవసాయ భూముల నుంచి నీటిని తెచ్చుకుని అవసరాలకు వాడుకుంటున్నారని, తాగడానికి నీటిని కొనుక్కుంటున్నా రన్నారు. 30 కుటుంబాలు ఉన్న ఈ కాలనీలో నీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు , ఎమ్మెల్యే విఫలమయ్యారని పేర్కొన్నారు. వెంటనే నీటి సమస్యపరిష్కరించాలని లేకుంటే కలెక్టర్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కాలనీవాసులు జమున , బాగాల శ్యామల, లచ్చక్క, బక్కక్క, కుర్మ బుజ్జక్క, సాలక్క, మహేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

శ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జూలై 9న చేపట్టాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన వెలువడింది. కార్మిక సంఘాల నాయకులు గురువారం రాత్రి సమావేశమయ్యారు. దేశంలోని పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సమ్మె తేదీని జూలై 9కి మారుస్తున్నట్లు ప్రకటించాయి.ఈ నెల 20న పని ప్రదేశాలు, స్థానిక, జిల్లా స్థాయిలో కార్మికుల సమీకరణలు, ఆందోళన లు చేపట్టాలని అన్ని ట్రేడ్ యూనియన్లు నిర్ణయించాయి.

18న మెగా జాబ్‌మేళా

శ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తేదీన ఆర్‌జీ-1 ఏరియా గోదావరిఖనిలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సీఎండీ ఎన్ బలరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 100 కంపెనీల ద్వారా 3 వేల ఉద్యోగాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి మేళాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిఇపారు. ఇప్పటికే మందమర్రి, రామగుండం-1, భూపాలపల్లి ఏరియాలలో నిరుద్యోగ యువత కోసం స్కిల్ సెంటర్లు ప్రారంభించామని పేర్కొన్నారు. దీన్ని మరిన్ని ఏరియాలకు విస్తరిస్తామని తెలిపారు. సింగరేణి ప్రాంతంలోని యువతకు చేయూత అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత జాబ్‌మేళాలను సద్విని యోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలని సీఎండీ సూచించారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, పాల్గొన్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): పాత చట్టాలను మార్చడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా అన్నారు. ఎస్ఆర్‌పీ 1, ఆర్‌కే 6 గనులపై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సింగరేణి కార్మి క సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడారు. కార్మికులు ఎన్నో ఏళ్ల పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించే ప్రయత్నం చేస్తోందని, 8 గంటల పని దినాలను 12 గంటలకు పెంచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దీనివల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రైవేటు పెట్టుబడిదారులకు లాభం చేకూరుతుందన్నారు. జాతీయ సంపద అయిన బొగ్గును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ససేమిరా ఒప్పుకునేది లేదని తెలిపారు. భవిష్యత్తును పరిగణలోకి తీసుకొని సింగరేణి కార్మికులు ఐక్య పోరటాలు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్‌రావు, గరిగె స్వామి, తిరుపతిరాజు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకులు గుల్ల బాలాజీ, కస్తూరి చంద్రశేఖర్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకుడు పొగాకు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో కార్మికులకు నష్టం



కాసిపేట 2వగనిపై మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు దాగాం మల్లేశ్

కాసిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో కార్మికులకు నష్టం జరుగుందని సింగరేణి జేఏసీ నాయకుడు దాగాం మల్లేశ్ అన్నారు. గురువారం కాసిపేట 2వగనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని చెప్పారు. ఉద్యమాలతోనే హక్కుల సాధన సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గొల్ల శ్రీనివాస్, నర్సయ్య, వెంకటేష్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, సీఐటీయు డిప్యూటి జనరల్ సెక్రటరీ నాగమణి గోపాల్, టీబీజీకేఎస్ నాయకులు సారంగపాణి పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఎన్ఎస్‌పీసీఎల్‌తో సింగరేణి ఒప్పందం

ఐదు లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు అంగీకారం

శ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దుర్గాపూర్‌లో ఉన్న ఎన్ఎస్‌పీసీఎల్ థర్మల్ విద్యుత్ కంపెనీతో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఒప్పందం చేసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు అంగీకారం తెలిపింది. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్‌డీఎం సుభాని, జీఎం(మార్కెటింగ్) ఎన్‌వి రాజశేఖర్, ఎన్ఎస్‌పీసీఎల్ సీఈఓ దివాకర్ కౌశల్, జీఎంలు నీల్ కమల్, పలాష్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు. జాతీయ విద్యుత్ సంస్థ అయిన ఎన్‌టీపీసీ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఎన్ఎస్‌పీసీఎల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కంపెనీకి చెందిన థర్మల్ విద్యుత్ కేంద్రానికి సింగరేణి బొగ్గు సరఫరా చేయనుంది. కార్యక్రమంలో మార్కెటింగ్ డీజీఎంలు శ్రీనివాసరాజు, సురేందర్ రాజు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

రెబ్బెన, మే 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను కేంద్రం కాలరాస్తోందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి అన్నారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఏళ్లతరబడి పోరాడా సాధించుకున్న హక్కులను కేంద్రం మార్చడం సరికాదని చెప్పారు. ఈ విధానాలను కార్మికులు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, నాయకులు జూపాక రాజేష్, జగ్గయ్య, ఎం.శేషశయనారావు, మీసా చంద్రశేఖర్, దేవర కొండ దివాకర్, మాల ఓదెలు, వెంకటేష్, తిరుపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సరస్వతి నమస్తుభ్యం..



కాళేశ్వరంలో పుష్కర స్నానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే విజయరమణారావు



పుణ్యస్నానాలాచరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులు



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు, నాయకులు

పుష్కరఘాట్ వద్దకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, నాయకులు

- కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం
- పుష్కర స్నానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- తొలిరోజే పోటెత్తిన భక్తులు

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలు గురువారం వేకువజామున ప్రారంభమయ్యాయి. కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద ఉదయం 5.40 గంటలకు పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. తొలిరోజే పుష్కర స్నానాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు పుష్కర స్నానం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసగించారు. ఈ నెల 26 వరకు సరస్వతీ పుష్కరాలు జరుగనున్నాయి.

● ఎండను సైతం లెక్క చేయకుండా

సరస్వతి నది పుష్కరాలకు భక్తులు ఎండ సైతం లెక్క చేయకుండా తరలివచ్చారు. మధ్యాహ్నం సమయంలో కూడ పుష్కర స్నానాలు ఆచరించడానికి భక్తులు నదికి రావడంతో జన సంద్రంగా మారింది. ఉదయం భక్తుల రద్దీ ఉండగా మధ్యాహ్నం వరకూ కొనసాగింది. ఎండకు వచ్చిన భక్తులు నదిలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సేద తీరారు.

● భక్తుల సౌకర్యార్థం బస్సుల ఏర్పాటు

సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రైవేటు పాఠశాలల, సింగరేణి బస్సులను ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద నుంచి పుష్కర ఘాట్‌కు ప్రయాణికులను తరలించేందుకు సుమారు 30 బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బస్సులు ప్రయాణికులను పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ వద్ద దించి తిరిగి తాత్కాలిక బస్టాండ్ వద్దకు చేరుకుంటున్నాయి.

● పుష్కర ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు

పుష్కర ఘాట్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మహాదేవపూర్, కాళేశ్వరానికి చెందిన 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు రెండు షిఫ్ట్‌ల్లో అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. నదిలో భక్తులు లోతుకు వెళ్లకుండా మరో బృందం గస్తీ తిరుగుతూ భక్తులను అప్రమత్తం చేస్తుంది.

● ఫొటోల కోసం క్యూ..

పుష్కరాల్లో భాగంగా సరస్వతి మాత విగ్రహం సమీపంలో, టెంట్ సిటీ, ఇతరాత్ర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దేవుడి విగ్రహాల వద్ద ఫొటోలు దిగేందుకు భక్తులు క్యూ కట్టారు.

● నేడు ఉపముఖ్యమంత్రి రాక

సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం కాళేశ్వరానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నారు. ఉదయం కాళేశ్వరం చేరుకుని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు.


● అందుబాటులో ఫైర్ వాహనాలు

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. నాలుగు ఫైర్ వాహనాలు, 2 ఓపీఎమ్ బోట్లు, 40 మంది సిబ్బంది, 2 రిమోట్ కంట్రోల్ బోట్లు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి. హెలీప్యాడ్, సరస్వతీ పుష్కర ఘాట్, టెంట్‌సిటీ, టెంపుల్ వద్ద ఈ ఫైర్ ఇంజన్ వాహనాలు, అగ్నిమాపకశాఖ యంత్రాంగం అందుబాటులో ఉంటుంది.

● సీఎం రాకతో దర్శనాల నిలిపివేత

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలను అధికారులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి తొలుత పుష్కర ఘాట్‌ను ప్రారంభించి న అనంతరం ఆలయానికి చేరుకుని మహాదేవుడికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు గంటల పాటు దర్శనాలను నిలిపివేశారు. దాంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.









త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

సందిగ్ధానికి తెర..

(5వ పేజీ తరువాయి)

హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవస్థ లు దృష్టిలో ఉంచుకున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఎంసీహెచ్‌ను కూడా ఐబీ చౌరస్తా సమీపంలో నిర్మించబోయే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలోకి మార్చాలనే ఉద్దేశ్యంతో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

● అనువైన చోట భవన నిర్మాణం..

జిల్లా కేంద్రంలోని ఐబీ సమీపంలో ఆసుపత్రుల నిర్మాణం కోసం కేటాయించిన స్థలం అన్ని విధాలా అనువైనదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ స్థలానికి ఎదురుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉండటంతో వైద్యం కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండనుంది. రెండు ఆస్పత్రులకు నడుమ జాతీయ రహదారి ఉండటంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే నిత్యం బిజీగా ఉండే రోడ్డు దాట డానికి ఇబ్బందులు పడకుండా రోగులు చికిత్స పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది. పైగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చేందుకు రోగులకు బస్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఐబీ చౌరస్తాలో బస్సు దిగగానే నేరుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితోపాటు, ఎదురుగా ఉన్న ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. గోదావరి సమీపంలో ఉన్న ఎంసీహెచ్‌కు చేరడానికి ఇంతకాలం నానా అవస్థలు పడ్డ రోగులు, వారి కుటుంబ సభ్యులు ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి మహాసభల్లో జిల్లా నాయకులు



తిరుపతి మహాసభలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నాయకులు

నస్పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15 నుంచి 18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరుగుతున్న అఖిల భారతీయ యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభ సమావేశాల్లో నస్పూర్ పట్టణానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, జాతీయ కౌన్సిలర్ సభ్యులు లింగం రవి, జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, మారబోయిన రవి, పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

దండేపల్లి, మే15 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బ్యాంకు సేవలను ప్రజలందరు వినియోగించుకోవాలని తాళ్లపేట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథ్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ రవీందర్ కోరారు. దండేపల్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం (సీఎఫ్ఎల్) ఆధ్వర్యంలో గురువారం దండేపల్లి మండలం ధర్మరావుపేటలో ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశానికి వెళ్లి బ్యాంకు సేవల వినియోగంపై వారు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకులో అకౌంట్లు లేని వారు బ్యాంకు ఖాతాలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, వికలాంగుల వినియోగదారులకు ఇంటి వద్దకే బ్యాంకు సేవ సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. సైబర్‌నేరస్థుల వలలో చిక్కి డబ్బులను పోగొట్టుకోవద్దని, అలా ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో దండేపల్లి సీఎఫ్ఎల్ కౌన్సిలర్ గడికందుల హరీష్, మేసు నూతన్, ఎఫ్ఏ రాకేష్, ఉపాధి కూలీలు ఉన్నారు.

హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడుదాం

సీఐటీయూ నాయకులు

హాజీపూర్, మే15 (ఆంధ్రజ్యోతి): హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలో ఉన్న అన్ని రకాల హమాలీకార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొమాసప్రకాశ్ కోరారు. గురువారం హాజీపూర్ మండలంలోని ముల్కల్లలో గుడిపేట, హాజీపూర్, పడ్తన్‌పల్లి, కర్ణమామిడి, దొనబండ, ముత్యంపేట గ్రామాల్లో ఉన్న హమాలీలను కలిసి కరపత్రాలు పోస్టర్లు రిలీజ్‌చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొమాస ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్రంలో 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మికులకు బానిసలుగా మార్చే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి, హమాలీకార్మికులకు వెల్ఫేర్‌బోర్డు, ప్రమాదబీమా, ఇన్సురెన్స్, పింఛన్, పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలు కల్పించాలని జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లాలో ఉన్న రైసుమిల్లు హమాలీ, మార్కెట్, ఎఫ్‌సీఐ గోదాం, ఐకేపీ సెంటర్స్ హమాలీ, లిక్కర్‌డిపో హమాలీ తదితర అన్నిరకాల హమాలీలు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లు యూనియన్ కార్యదర్శి సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.



హమాలీలతో సీఐటీయూ నాయకులు

నెన్నెల : కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి పిలుపునిచ్చారు. సమ్మె పోస్టర్లను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. తిరుపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక నల్ల చట్టాలు, లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి వారి హక్కులను హరిస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్మికులు, వ్యాపార, వాణిజ్య సంస్థలు సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. నాయకులు అశోక్, పుట్ట గంగయ్య, నాగేష్, శాతి మొండి, దడంగి రమేష్ పాల్గొన్నారు.

పలు రైళ్ల నిలుపుదలకు వినతి

మంచిర్యాలకలెక్టర్, మే15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మీదుగా వెళ్లే పలు రైళ్ల నిలుపుదలకు గురువారం ఉత్తర తెలంగాణ రైల్వేఫోరం అధ్యక్షులు అజయ్ క్రాంతి సింగ్ గురువారం రైల్వే డీఆర్ఎం భారతీస్ కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి జంక్షన్ తనిఖీ చేసేందుకు వచ్చిన ఆయనను కలిసి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు త్రివేండ్రం, స్వర్ణజయంతి రైలు, ఎర్నాకులంమిలీనియం, ఛైన్‌గంగా, చెన్నైసెంట్రల్‌కు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలన్నారు. బల్లార్షా నుంచి కాసిపేట ఎక్స్‌ప్రెస్ రైలును చెర్లపల్లి వరకు పొడిగించాలన్నారు. ఉత్తరతెలంగాణ రైల్వేఫోరం నాయకులు దేవిసింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

బాలింతలకు అన్నదానం

బెల్లంపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): మోదిక్యాంటీన్ ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సంగీత ఆధ్వర్యంలో గురువారం బాలింతలకు అన్నదానం పంపిణీ చేశారు. కరోన సమయం నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొమాస కమల, స్రవంతి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

భీమిని ఏడీఏ సురేఖ

నెన్నెల, మే 15 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. ఏవోలు, ఏఈవోలు డీలర్ల క్రయ విక్రయాలపై నిఘా ఉంచాలని సూచించారు. నెన్నెల, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల విత్తన డీలర్లు, వ్యవసాయ అధికారులతో నెన్నెల రైతు వేదికలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆమోదిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే షాపుల్లో అమ్మాలన్నారు. మేలురకం విత్తనాలను ఎంఆర్‌పీకే అమ్మి, పూర్తి వివరాలతో కూడిన రసీదును రైతుకు అందజేయాలన్నారు. వానాకాలం పంట సీజన్‌కు సరిపడ విత్తనాలు, ఎరువులను ముందుగానే నిల్వ ఉంచుకోవాలన్నారు. అవసరమైన స్టాక్ కోసం ఇండెంట్ పెట్టుకొని కొరత లేకుండా చూసుకోవాలన్నారు. స్టాక్ రిజిస్టర్ తప్పకుండా రాయాలన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తూ ఆశించిన పంట దిగుబడులు సాధించేందుకు తోడ్పాటు అందివ్వాలన్నారు. వ్యవసాయ అధికారులు పుష్పాల సృజన, వీరన్న, ప్రశాంత్, యమున, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

‘రైతులు వ్యవసాయ మోటార్లు ఇంటికి తీసుకెళ్లండి’

దండేపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల పనులు ముగించినందున రైతులు తమ వ్యవసాయ మోటార్లను బావుల వద్ద ఉంచకుండా ఇంటికి తీసుకెళ్లాలని దండేపల్లి ఎస్సై తహసినోద్దీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పనులు ముగిసిన సందర్భంగా రైతులు మళ్లీ పంట వేసే వరకు పొలాలకు వెళ్లరు. దీంతో బావుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు దొంగలు ఎత్తుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి రైతులు తమ పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు ఇంటికి తీసుకపోవాలని రైతులకు సూచించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

కాసిపేట, మే15(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తాయని దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. గురువారం దేవాపూర్ గొల్లవాడలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణలో నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సీసీ కెమెరాల వల్ల నేరాల నియంత్రణకూడ గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇందుకు స్థానిక ప్రజల నుంచి సాకారం ఎంతో అవసరం. నేరాల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.



దేవాపూర్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

తాండూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతుల భూముల్లోకి అటవీ అధికారులు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఈ భూములు సాగు చేసుకుంటున్నారని ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు సుభాష్, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై లాఠీచార్జి


చెన్నూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి నది పుష్కరాల సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ల్లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఫోటో లేకపోవడం వివాదానికి దారి తీసింది. దీంతో చెన్నూరు, కోటపల్లి మండలాలకు చెందిన సుమారు 200 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాళేశ్వరం చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పుష్కరస్నానం ఆచరించి తిరిగి వస్తున్న క్రమంలో ప్లకార్డులు పట్టుకున్న కాంగ్రెస్ నాయకులు సీఎంకు అడ్డుగా నిలిచారు. దీంతో పోలీసులు సదరు నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జి చేసి అరెస్టు చేశారు. దళిత ఎంపీ అనే కారణంతోనే ఫ్లెక్సీల్లో ఆయన ఫోటో పెట్టలేదని, పుష్కరాలకు ఆహ్వానించలేదని నాయకులు వాపోయారు.

దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంవత్సరం 2025-26కు గాను ప్రైవేటు కళాశాలలో ఇంటర్‌తో పాటు ఎంసెట్ కోచింగ్ (కార్పొరేట్) ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి వార్షిక పరీక్షల్లో 7జీపీఏ ఆపై ఫలితాలు సాధించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు ఈబీసీ మైనార్టీ దివ్యాంగ విద్యార్థులు ఈనెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

మంచిర్యాలలో అండర్-25 క్రికెట్ పోటీలు

మంచిర్యాల కలెక్టర్, మే 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆదివారం క్రికెట్ అండర్ 25 క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు సెలక్షన్ కమిటీ కోచ్, జిల్లా సెక్రటరీలు కోదాడ ప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి క్రికెట్ ఎంపిక పోటీలు ఉంటాయని క్రీడాకారులు పుట్టిన తేది సర్టిఫికేట్‌తో పాటు సొంత కిట్లను వెంట తీసుకరావాలన్నారు. ఆరు టీంలు డివైడ్ చేసి ఎంపిక చేసుకొని లీగ్ మ్యాచ్‌లను మంచిర్యాలలో నిర్వహిస్తామన్నారు. బెస్ట్ పర్ఫార్మెన్స్ చేసిన క్రీడాకారులను ఆదిలాబాద్ జిల్లా జట్టుకు సెలక్ట్ చేసి హైదరాబాద్‌కు పంపిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.





టీఎన్‌జీవో కాలనీలో వికసించిన మే పుష్పం

వికసించిన మే పుష్పం...

నస్పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని గుండెటి యోగేశ్వర్ నివాసంలో మే పుష్పం వికసించి చూపరులను ఆకట్టుకుంటోంది. మే పుష్పం ఎండలు విపరీతంగా ఉన్న సమయంలోనే పూస్తుంది. అందుకనే దీనిని మే పువ్వు అంటారు. కాలనీలోని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నేడు సంకటహర చతుర్థి

నస్పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మీగణపతి దేవాలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రఘుపతి రావు, ప్రధాన అర్చకులు వంశీ క్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఉదయం స్వామి వారికి షోడశ ద్రవ్యాభిషేకం, గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ, రుద్రహోమం, అర్చనలు ఉంటాయన్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు పురవీధుల్లో ఊరేగింపు, పల్లకి సేవ ఉంటుందన్నారు.

సందిగ్ధానికి తెర..

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనం నమూనా



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు

- మొదటి విడుతతో రూ. 50 కోట్లు..
- రెండో విడుతలో రూ. 250 కోట్లు విడుదల
- పరిపాలనా అనుమతులు జారీ
- జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, మహారాష్ట్ర ప్రజలకు మేలు



సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు (ఫైల్)

మంచిర్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వపరంగా నిర్మించతలపెట్టిన 600 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి అవసరమైన నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలోని పాత ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో గల 4.33 ఎకరాల స్థలాన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. రూ.324కోట్ల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణం కోసం తెలంగాణ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ తొలి విడతగా రూ.50కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ సెప్టెంబరు 12న జీవో 546న విడుదల చేయగా, నవంబరు 21న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. మొదటి విడుతలో మంజూరైన రూ.50కోట్లతో భవనాల నిర్మాణ పనులు ప్రారంభంకాగా తాజాగా రెండో విడుత నిధులు రూ. 250 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఈ నెల 13న జీవో 209 ద్వారా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఇంతకాలం నెలకొన్న సందిగ్ధానికి తెరపడింది. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన నిధులు దాదాపుగా పూర్తి స్థాయిలో విడుదల కావడంతో పనులు ఊపందుకోనున్నాయి.

కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం...

జిల్లా కేంద్రంలోని ఐబీ సమీపంలో నిర్మితం అవుతున్న ఆసుపత్రి భవన సముదాయంలో మొత్తం ఏడు అంతస్థులతో భవన నిర్మాణం చేపడుతుండగా, కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు ప్రజలకు అందనున్నాయి. భవన నిర్మాణాన్ని గరిష్ఠంగా మూడు సంవత్సరాల కాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు తో మంచిర్యాల, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన ప్రాంగణంలోనే మాతా, శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) భవనం నిర్మాణం జరుగుతుండగా, ఒకే ప్రాంగణంలో రెండు ఆసుపత్రుల నిర్వహణ కొనసాగనుంది. ప్రస్తుతం ఎంసీహెచ్ జిల్లా కేంద్రంలోని గోదావరి సమీపంలో ఉంది. దీంతో వర్షాకాలంలో ప్రతియేటా గోదావరి ఉప్పొంగినప్పుడల్లా వరదలకు ఆసుపత్రి భవనం ముంపునకు గురవుతోంది. దీంతో పగలు, రాత్రి తేడాలేకుండా అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులను...

(తరువాయి 7లో)

సన్నరకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



కిష్టంపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన సన్నరకం వడ్లను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయాధికారుల ద్వారా రబీ సీజన్‌లో రైతులు సన్నరకాలను సాగు చేయాలని ప్రోత్సహించి సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసిందని, తీరా పంట చేతికి వచ్చి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదన్నారు. ఇటీవల కిష్టంపేటలో రైతులు ఆందోళన చేసిన తర్వాత ఒక్క లోడు వడ్లు క్వింటాకుకు 20 కిలోలు అధికంగా తూకం వేసుకుని ఒక మిల్లర్ తీసుకున్నారన్నారు. సన్నరకాల వడ్ల నుంచి నూక వస్తుందని రైతులను వేధించడం సరైంది కాదన్నారు. సన్నరకాల వడ్లకు బోనస్ వస్తుందని ఆశించిన రైతులకు అసలుకే మోసం వచ్చిందన్నారు. రైతులు కష్టపడుతున్నా స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఈ విషయంపై స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు ఆలం బాపు, కొటారి వెంకటేష్, శివ కృష్ణ, వంశీగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల్లో విద్యుత్ సరఫరా



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఇ గంగాధర్, సిబ్బంది

చెన్నూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలకు దీటుగా పల్లెలకు విద్యుత్ సరఫరా అందించాలని మంచిర్యాల ఎస్ఈ గంగాధర్ అన్నారు. గురువారం మండలంలోని కొమ్మెర, ఆస్నాద, పొక్కూరు గ్రామాల్లోని సబ్‌స్టేషన్లను సందర్శించారు. కొమ్మెర సబ్‌స్టేషన్‌లో ఇంతకు ముందు ఉన్న 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతనంగా ఏర్పాటు చేసిన 9ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో లో-ఓల్టేజీ సమస్యలు ఉండవని తెలిపారు. విద్యుత్ మోటార్ల వద్ద రైతులు కెపాసిటర్లను అమర్చుకోవాలని తెలిపారు. పొక్కూరు సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక బ్రేకర్, బీరెల్లి, రాచ్చవెల్లి, పీడర్లు ఒక బ్రేకర్ కలిగి ఉండడంతో తరుచూ అంతరాయం ఏర్పడుతుందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని పరిష్కారానికి 11కేవీ బీరెల్లి ఫీడర్‌కు శాశ్వత పరిష్కారంగా 11కేవీ ఫీడర్‌కు స్పెషల్ బ్రేకర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించామన్నారు. అనంతరం ఆస్నాద సబ్‌స్టేషన్‌లో ఎస్ఈ, ఏఈలను మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈ కైసర్, ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్‌లు రమేష్‌రెడ్డి, రాజమల్లు, మాజీ ఉపసర్పంచు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అటవీహక్కులు అమలు చేయడంలో విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

మంచిర్యాల కలెక్టరేట్, మే15 (ఆంధ్రజ్యోతి): అటవిహక్కులు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రస్ట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఫారెస్టు అధికారులు పోడు సాగుదారులకు హక్కు పత్రాలు, పట్టాలుంటేనే సాగు చేయాలని, లేకుంటే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారన్నారు. ట్రాక్టర్ యజమానులు దున్నడానికి వెళితే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసులు పెడుతూ యజమానులు నోటిసులిస్తున్నారన్నారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని ఫారెస్టు అటవీఅధికారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇప్పటికే 11774 మంది రైతులు 33417 ఎకరాలో సాగు చేస్తున్నామని దరఖాస్తు చేసుకుంటే కేవలం 1847 మందికి హక్కు పత్రాలు ఇచ్చారన్నారు. 2006 హక్కుల చట్ట ప్రకారం హక్కు పత్రాలు ఇస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రకాశ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుంపల రంజిత్‌కుమార్ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన డీసీపీ భాస్కర్

నస్పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ భవన సముదాయ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల ప్రమాదాలు జరుగ కుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయా రోడ్లలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి (బ్లాక్‌స్పాట్) సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. రహదారులు మరమ్మతులు జరిగే ప్రాంతాల్లో సూచికబోర్డులు పెట్టాలన్నారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టి డ్రంకెన్ డ్రైవ్ కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఇతర వాహనాలకు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి వైన్స్, బార్ రెస్టారెంట్ల వద్ద పార్కింగ్ స్థలాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ ఏరియాలో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలన్నారు. అవసరం ఉన్న ప్రాంతాల నుంచి వాహనాల వేగ నియంత్రణ సూచిక బోర్డులు రేడియం, లైటింగ్ ఏర్పాటు చర్యలు చేపట్టాన్నారు. ఈ సమీక్ష సమావే శంలో డీసీపీ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీశ్‌సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాసరావు, హరిక్రిష్ణ, పోలీసు రవాణ, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెడ్ క్రాస్ సోసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన



మహిళలకు అవగాహనకల్పిస్తున్న ఏపీఎం రాజ్‌కుమార్

జైపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇందారంలో గురువారం మహిళ సంఘం సభ్యులకు బీమా పథకాలపై ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు బీమా తప్పకుండా ఉండాలని, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంలో వార్షిక ప్రీమియం రూ. 20కే రూ. 2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. 18నుంచి 70 ఏళ్ల వరకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం వార్షిక ప్రీమియం రూ. 430 చెల్లించాల్సి వస్తుందన్నారు. 18నుంచి 50 ఏళ్ల వారు అర్హులన్నారు. గతంలో బీమా చేసుకున్నవారు రెన్యువల్ చేసుకోవాలన్నారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో ప్రతి గృహిణి పెన్షన్ పొందే వీలుంటుందన్నారు. 18నుంచి 40 ఏళ్ల వారు చేరితే 60 ఏళ్ల వయస్సు తర్వాత పిం చన్ వస్తుందన్నారు. మహిళ సంఘాల సభ్యులు సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమన్, గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

- పుణ్యస్నానానికి తరలివెళ్తున్న భక్తులు



మంచిర్యాల బస్టాండ్ నుంచి పుష్కరాలకు తరలి వెళ్తున్న భక్తులు

మంచిర్యాల కలెక్టరేట్, మే15(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలోని త్రివేణి సంఘమం సరస్వతి పుష్కరాలు గురువారం ప్రారంభమ య్యాయి. మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి 30 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్టీసీ కేటాయించింది. గురువారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన పుష్కరమహోత్సవానికి ఏర్పాట్లు విస్తృతంగా చేసినట్లు అధికారులు తెలిపారు. మంచిర్యాల ఆర్టీసీడిపో ఆవరణలో ప్రత్యేక టెంటు వేసి కౌంటరును ఏర్పాటు చేశారు. పుష్కరాలకు వెళ్లే భక్తులు టిక్కెట్లు తీసుకునేందుకు కౌంటర్‌లో సంప్రదించాలని పేర్కొంటున్నారు. ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌లు కౌంటర్‌ను ప్రారంభించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

టిక్కెట్లు ధరలు ఇలా...

పుష్కరాల్లో పుణ్యస్నానం ఆచరించే భక్తులకు మంచిర్యాల నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.80, శ్రీరాంపూర్ నుంచి పెద్దలకు 140 రూపాయలు, పిల్లలకు 70రూపాయలు, చెన్నూర్ నుంచి పెద్దవాళ్లకు రూ.80, చిన్న ప్లిలలకు రూ.50 రూపాయలు ధర నిర్ణయించినట్లు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది

30 ఎక్స్‌ప్రెస్ బస్సులు...

పుష్కరాలను పురస్కరించుకొని ఆర్టీసీ యాజమాన్య మంచిర్యాల నుంచి 30 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సులను కేటాయించారు. గురువా రం నుంచి మొదలు కొని 12రోజుల పాటు పుణ్యాస్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం బస్సులను నడిపించనున్నట్లు ఆర్టీసీ యాజ మ్యాం తెలిపింది. పుష్కర భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితం..

కాళేశ్వరంలోని సరస్వతి పుష్కరాల్లో పాల్గొనే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడం సురక్షితం. గోదావరి హారతి, పుణ్యస్నానం స్వామివారి దర్శనంలో పాల్గొనే భక్తులు ఆర్టీసీ బస్సును సద్వినియోగం చేసుకొని పుణ్యాస్నానాలు ఆచరించాలి. భక్తుల రద్దీ, ఎండవేడిమి దృష్ట్యా ఆర్టీసీ యాజమాన్యం బస్సులో మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఎక్కడ కూడ ఇబ్బంది లేకుండా చూడాలని ఇతర అధికారులకు, డ్రైవర్లకు, కండక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతీ గ్రామంలో మున్నూరు కాపు సంఘాల ఏర్పాటు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య, పక్కన వర్కింగ్ ప్రసిడెంట్ రాజారాం

నస్పూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ గ్రామాన మున్నూరు కాపు సంఘా లను ఏర్పాటు చేస్తూ, ఒకే సంఘంగా ఐక్యతను చాటుదామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజా రాం అన్నారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక జనాభాతో కూడిన ము న్నూరు కాపులను ప్రభుత్వం తక్కువ సంఖ్యలో చూపిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో 12వేల గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంఘంలో సభ్యులుగా ఉన్నవారు ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ ద్వారా కమిటీలను ఎన్నుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణను చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ క్యాబినేట్‌లో మున్నూరు కాపులకు మం త్రి పదవి ఇవ్వాలని కోరారు. ఆగస్టు 30, 31వ తేదీన అమెరికాలో మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అమెరికాలో నిర్వహించే మున్నూరు కాపు మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సం ఘం నియోజకవర్గ అధ్యక్షులు పల్లె భూమేశ్, జిల్లా గౌరవ అధ్యక్షులు గొంగల్ల శంకర్, కన్వీనర్ ఆకుల సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి రాజేశం, నస్పూర్ మండల కమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తీరని వ్యథ

- అభివృద్ధికి నోచుకోని తిర్యాణి
- గ్రామాలకు రహదారులు కరువు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

6

సమీకృత కూరగాయల మార్కెట్‌ను వ్యాపారులు..

సద్వినియోగం చేసుకోవాలి

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి



ఖాజీపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భీమారం మండలంలోని కాజీపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వహాకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులకు కేంద్రాల వద్ద నీడ, తాగునీరు, ఓఆర్ ఎస్ సౌకర్యం కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ లను సమకూర్చామన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు రశీదు జారీ చేయాలని సూచిం చారు. భీమారం మండలం కాజీపల్లి ప్రభుత్వ పాఠశాలలో వెల్లపల్లి గ్రామానికి సంబంధించిన ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సును ప్రత్యేక తహసీల్దార్ కృష్ణతో కలిసి సందర్శించి దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. భూ భారతి ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సదానందం, ప్రత్యేక తహసీల్దార్ మల్లికార్జున్‌లతో కలిసి భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను ప్రతిరోజు చేపట్టాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని అర్హులకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

జైపూర్ : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడు తూ నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు రశీదు అందించాలని సూచించారు.